హరితోత్సవానికి మొక్కలు సిద్ధం



ఇబ్రహీంపట్నం: ఎల్మినేడు నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు



కడ్తాల్: మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తున్న ఈజీఎస్ కూలీలు

- గ్రామానికి వెయ్యి చొప్పున నాటేందుకు ప్రణాళిక
- గుంతలు తీసే పనులను పూర్తిచేసిన ఈజీఎస్ కూలీలు

కడ్తాల్: అడవుల శాతం పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, గ్రామాల్లో పచ్చదనం కోసం రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని తీసుకువచ్చింది. గత తొమ్మిదేళ్లుగా ఈ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతోంది. ఈనెల 19న హరితోత్సవంలో భాగంగా పెద్దఎత్తున మొక్కలు నాటాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కల పెంపకానికి నర్సరీలను మంజూరు చేయడంతో పాటు ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఆయా నర్సరీల్లో మొక్కల పెంపకం పనులు పూర్తిచేశారు. హరితోత్సవం రోజున మొక్కలు నాటనున్నారు.

సిద్ధంగా 2.40లక్షల మొక్కలు

కడ్తాల మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 24 నర్సరీలు ఏర్పాటు చేశారు. హరితోత్సవంలో భాగంగా ప్రతి గ్రామంలో 10వేల మొక్కల చొప్పున అన్ని పంచాయతీల్లో కలిపి 2.40 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధం చేశారు. ఉపాధిహామీ పథకం కింద ఇప్పటికే ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు గుంతలు తీసే పనులు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి. అదేవిధంగా ప్రతి ఇంటికి ఆరు (పూల, పండ్ల) మొక్కలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. మొక్కల సంరక్షణ బాధ్యతలు కూడా చేపట్టాలని ప్రజలకు వివరించాలని ఈజీఎస్ సిబ్బందికి, కార్యదర్శులకు అధికారులు సూచించారు.

ఇబ్రహీంపట్నం మండలంలో..

ఇబ్రహీంపట్నం: హరితహారంలో భాగంగా ఇబ్రహీంపట్నం మండల పరిధిలో సుమారు 8లక్షల మొక్కలు నాటేందుంకు అధిరాలు ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలకరి వర్షాలు కురిసిన అనంతరం జూలై నెలలో హరితహారం కార్యక్రమాన్ని సర్కార్ ప్రారంభించడం అనవాయితీగా వస్తుంది. అయితే ఈ యేడు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో హరితహార కార్యక్రమాన్ని ముందస్తుగా ప్రారంభించనున్నారు. ఈనెల 19న ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 1000 మొక్కలు నాటి హరితోత్సవం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఎల్మినేడు, చర్లపటేల్‌గూడ, కర్ణంగూడ, దండుమైలారం, నాగన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు. ప్రతి నర్సరీలో లక్ష మొక్కలు చొప్పున 5లక్షల మొక్కలను పెంచారు. ఉపాధి హామి పథకం కింద మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీల్లో నర్సరీలను నిర్వహిస్తున్నారు. ఒక లక్షా 53 వేల మొక్కలను ఈ నర్సరీల్లో పెంచారు. ప్రతి ఇంటికి ఆరు మొక్కలను నాటేందుకు ఇవ్వనున్నారు.

లక్ష్యాన్ని పూర్తిచేస్తాం



జిల్లా అధికారుల ఆదేశానుసారం మండలంలోని ప్రతి గ్రామంలో 10వేల మొక్కల చొప్పున 24 జీపీల్లో మొత్తం 2.40 లక్షల మొక్కలను నాటనున్నాం. నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి.ఇప్పటికే ఉపాధిహమీ పథకం కింద గుంతలు తీసి, గ్రామాలకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేస్తున్నాం. రహదారుల వెంట, ఖాళీ ప్రదేశాల్లో, రైతులకు అవసరమయ్యే మొక్కలు, ఇంటి ఆవరణలో నాటే మొక్కలను సిద్ధం చేశాం. నిర్దేశించిన లక్ష్యాన్ని వందశాతం పూర్తి చేస్తాం.

– రామకృష్ణ, ఎంపీడీఓ, కడ్తాల్

మొక్కలు సిద్ధంగా ఉన్నాయి



తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 19న నిర్వహించే హరితోత్సవంలో ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో వెయ్యి మొక్కలు నాటుతాం. అదేవిధంగా గ్రామాల్లో, రోడ్డుకిరువైపులా, పొలం గట్ల వద్ద మొక్కలు నాటిస్తాం. ప్రతి ఇంటికి 6 మొక్కలను అందజేస్తాం.

– తిరుపతిచారి, ఏపీఎం, ఇబ్రహీంపట్నం

అందరూ భాగస్వాములు కావాలి



ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 5 అటవీశాఖ నర్సరీలుండగా ఒక్కొక్క నర్సరీలో లక్ష చొప్పున వివిధ రకాల మొక్కలు పెంచాం. ఉన్నతాధికారుల ఆదేశానుసారం హరితహారంలో భాగంగా ఈమొక్కలు నాటుతాం. హరితహారంలో అందరూ భాగస్వాములు కావాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, అటవీశాఖ సాంకేతిక సహాయకుడు, ఇబ్రహీంపట్నం

‘పల్లెప్రగతి’ని విజయవంతం చేయండి

డీఎల్‌పీఓ అమృత



కడ్తాల్: ఏర్పాట్లను పరిశీలిస్తున్న అమృత

కడ్తాల్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15న నిర్వహించే తెలంగాణ పల్లెప్రగతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కందకూర్ డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) అమృత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి పల్లెప్రగతి ఉత్సవ ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. పల్లెప్రగతి దినోత్సవం రోజున మండల కేంద్రంలోని రైతువేదిక, పల్లెప్రకృతి వనం, నర్సరీ, వైకుంఠధామం, డంపింగ్‌యార్డు తదితర నిర్మాణాలను ప్రజలతో కలిసి సందర్శించాలని సూచించారు. తదుపరి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తెలంగాణ ప్రభుత్వం ద్వారా గ్రామ పంచాయతీలకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను, ఆర్థిక వనరులను, ఆదాయ వ్యయాలను ప్రజలకు తెలియాలన్నారు. అనంతరం గ్రామ పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయనున్న దుస్తులను, పారిశుధ్య నిర్వాహణ ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీఓ మధుసూధనాచారి, కార్యదర్శి రాఘవేందర్, సిబ్బంది ఉన్నారు.

అవగాహన కల్పించండి

ఇబ్రహీంపట్నం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించే తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కృపేశ్ కోరారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. పల్లె ప్రగతి దినోత్సవం కంటే ముందు రోజు బుధవారం సన్నాహక కార్యక్రమాలను పూర్తిచేయాలన్నారు. పల్లె ప్రగతిపై గ్రామాల్లో టాంటాం వేయించడం, గ్రామ పంచాయతీలకు చెందిన వాహనాలకు, కార్యాలయానికి, కంపోస్టు షెడ్, వైకుంఠధా మాలకు మామిడాకులు, కొబ్బరి తోరణాలతో అలంకరణ, అన్ని వార్డులు ముగ్గులతో తీర్చిదిద్దడం, నాడు, నేడు పేరుతో 2014కు ముందు, అ తదుపరి గ్రామాల్లోని పరిస్థితులను వివరిస్తూ ఫ్లెక్సీలు కట్టడంలాంటి పనులు పూర్తిచేయాలన్నారు. పంచాయతీ సిబ్బందికి కిట్స్‌తోపాటు ప్రతిభ కనబరిచిన అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్, ఎంపీఓ లక్‌పతినాయక్ పాల్గొన్నారు.

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కమ్లీమోత్యానాయక్

ఎంపీపీ కమ్లీమోత్యానాయక్

కడ్తాల్: అంధత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బాలాజీనగర్, పల్లెచెలకతండా గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో కలిసి కంటి వెలుగు శిబిరాలను ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని తెలిపారు. ఆరోగ్య రంగంలో కంటి వెలుగు, బస్తీ దవాఖానాలు, టీ డయాగ్నోస్టిక్స్, మెడికల్ కళాశాలలు, ప్రభుత్వ ఆస్పత్రుల నిర్మాణంతో ప్రతి పేద, మధ్యతరగతివాడికి మెరుగైన వైద్యం అందిస్తున్నారన్నారు. సర్పంచ్‌లు కమ్లీ, లోకేశ్‌నాయక్, ఎంపీటీసీ రాములుగౌడ్, వైద్యులు కిరణ్‌కుమార్, సంపూర్ణ, సూపర్‌వైజర్ సుధీర్‌బాబు, ఏఎన్‌ఎం పద్మ, కార్యదర్శి రాఘవేందర్, స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

గ్రామ శివారులో పౌల్ట్రీ ఫాం వద్దు



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు, గ్రామస్తులు

కార్యదర్శికి వెల్జాల్ రైతుల ఫిర్యాదు

తలకొండపల్లి: గ్రామ శివారులో స్నేహ ఫౌల్ట్రీంఫాం వేయరాదని వెల్జాల్, సంఘాయిపల్లి గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వెల్జాల్ పంచాయతీ కార్యదర్శి శరత్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. మండల పరిధిలోని వెల్జాల్, సంఘాయిపల్లి గ్రామాల శివారు ప్రాంతంలో (కేవలం అర కిలోమీటర్ దూరంలో) స్నేహ ఫౌల్ట్రీఫాం వేయడానికి టీఎస్‌ఐపాస్ ద్వారా నిర్వాహకులు అనుమతి తీసుకున్నారు. దీంతో వారు ఫౌల్ట్రీఫాం నిర్మాణం చేపట్టడానికి మెటీరియల్‌ను సిద్ధం చేసుకుంటున్నారు. ఒక కోళ్ల ఫాం నిర్మాణం చేపట్టాలంటే గ్రామానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉండాలని నిబంధనలు ఉన్నాయి. నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మిస్తున్న ఫౌల్ట్రీ ఫాంను అడ్డుకోవాలని కార్యదర్శిని కోరారు. గ్రామానికి అతి సమీపంలో ఫౌల్ట్రీఫాం నిర్మిస్తుండటంతో చెరువులతో పాటు, పంట పొలాలు కాలుష్యమయ్యే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల శ్రేయస్సు దృష్ట్యా ఫౌల్ట్రీఫాం నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేడు వైద్య దినోత్సవం

ఇబ్రహీంపట్నం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం బొంగ్లూర్ క్రాస్‌రోడ్డు సమీపంలోని క్లాం జంగారెడ్డి గార్డెన్స్‌లో వైద్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ధరణికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విచ్చేస్తున్నట్లు చెప్పారు. వైద్య సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన తిరుగలపల్లి యాదయ్య అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను మంగళవారం గ్రామ టీఆర్ఎస్ అధ్యక్షుడు కడారి రాజు, పలువురు నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు కడారి రాజు రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సంజీవ్, కంబాలపల్లి రవి, జంగయ్య, రాములు, మహేందర్, వీరేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు చేయూత

తలకొండపల్లి: మండల పరిధిలోని మాదాయిపల్లికి చెందిన పోశయ్య ఇటీవల నూతన ఇంటి నిర్మాణం చేపట్టాడు. డబ్బులు లేక మధ్యలోనే ఇంటి నిర్మాణాన్ని నిలిపివేశాడు. వెల్జాల్ ఉప సర్పంచ్ అజీజ్ సహకారంతో జెడ్పీటీసీని కలుసుకొని ఇంటి స్లాబ్ నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయాలని పోశయ్య కోరాడు. జెడ్పీటీసీ ట్రస్టు సభ్యులచే పోశయ్య ఇంటి నిర్మాణానికి సిమెంట్, స్టీల్, ఇసుక, కాంక్రీట్ తదితర మెటీరియల్‌ను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అజీజ్, గౌరయ్య తదితరులు పాల్గొన్నారు.

దయాకర్‌రెడ్డికి ఘన నివాళి



దయాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు: మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నాయకుడు దయాకర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని కల్వకుర్తి టీడీపీ ఇన్‌చార్జి యాదీలాల్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని జాతీయ రహదారి రాజీవ్ చౌరస్తా వద్ద మంగళవారం దయాకర్‌రెడ్డి చిత్రపటానికి టీడీపీ నాయకులు నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు భాస్కర్, వెంకటేశ్, బాబా, నర్సింహ, జంగయ్య, శ్రీధర్, కుమార్‌గౌడ్, నరేశ్‌యాదవ్, వెంకటేశ్‌గౌడ్, మహేందర్, మణికంఠ, శేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్తులకు ఆర్థికసాయం చేయాలి



గీతకార్మికులతో మాట్లాడుతున్న జంగయ్య గౌడ్

వైఎస్సార్‌టీపీ నేత జంగయ్య గౌడ్

మంచాల: రాష్ట్ర ప్రభుత్వం బీసీలలో కులవృత్తులు చేసుకునే వారికి లక్ష రూపాయలు అందించే పథకంలో గౌడ కులస్తులకు స్థానం కల్పించకపోవడం తీరని అన్యాయమని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర నాయకుడు మాదగోని జంగయ్య గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఆరుట్ల గ్రామంలో గౌడ కులస్తులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చెనప్పే మాటల్లో చేసే పనుల్లో చాలా తేడా ఉందన్నారు. కులవృత్తులు చేసుకొని జీవించేవారికి రూ.లక్ష ఆర్థికసహాయం చేస్తామని చెబుతూనే గౌడ్లను, ముదిరాజ్‌లను ఈ పథకానికి దూరం చేయడం సరైంది కాదన్నారు. బీసీలలో మెజార్టీ కులస్తులను ఈ పథకంకు దూరం చేయడం దేనికి సంకేతమన్నారు. బీసీలోని ప్రతి కులస్తులకు ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు ప్రభాకర్ గౌడ్, సుంకరి దానయ్య గౌడ్ పాల్గొన్నారు.

ధరణి సమస్యలను పరిష్కరించండి

యువజన కాంగ్రెస్ నేతల వినతి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచాల: రైతులు ఎదుర్కొంటున్న ధరణి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోర చరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంచాల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారెడ్డికి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ధరణిలో టీఎం–33 అప్లికేషన్లు వేలాదిగా వచ్చాయన్నారు. 2022 నుంచి ఇప్పటివరకు వచ్చిన అప్లికేషన్లన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు. తక్షణమే వాటిని పరిష్కరించాలన్నారు. ధరణిలో నెలకొన్న లోపాల కారణంగా రైతులు అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ప్లాట్లు క్యాన్సల్ చేసుకున్న రైతులకు సంవత్సరం నుంచి ఇంకా డబ్బులు తిరిగి ఇవ్వడం లేదన్నారు. అదే విధంగా మోటేషన్లు పెట్టుకున్న వారికి కూడా సకాలంలో సమస్య పరిష్కారం చేయడం లేదన్నారు. ప్రభుత్వం ధరణిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల నాయకులు క్రాంతి, శ్రీకాంత్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

ఐక్యతా ఫౌండేషన్ సభ్యుడు వరప్రసాద్ రెడ్డి

తలకొండపల్లి: ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తానని ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో మంగళవారం నిర్వహించిన ఎల్లమ్మ దేవత నూతన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో వరప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రయ్య, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ భగ్‌వాన్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు రాఘవేందర్‌రెడ్డి, యువకులు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే పంచాయతీల అభివృద్ధి

పార్టీ మండల అధ్యక్షుడు శంకర్

తలకొండపల్లి: ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతోనే ఉమ్మడి పడకల్ గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాయని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుమ్మరి శంకర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దేవుని పడకల్‌లో ఆయన మాట్లాడుతూ.. జైపాల్‌యాదవ్ టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వెంకటాపూర్ గేట్ నుంచి పడకల్ వరకు కల్వర్టులు, బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా వంశీచంద్‌రెడ్డి ఉన్నప్పుడు ఈ ప్రాంత అభివృద్ధికి ఏలాంటి నిధులు మంజూర్ చేయలేదన్నారు. ఏ మోహం పెట్టుకొని ఆ పార్టీ నాయకులు ఈ ప్రాంతంలో పాదయాత్ర చేస్తారని ప్రశ్నించారు. మచ్చలేని ప్రజానాయకుడు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అని కొనియాడారు. కల్వకుర్తిలో 4వసారి ఎమ్మెల్యేగా జైపాల్‌యాదవ్ గెలుపొందడం ఖాయమని అన్నారు. అభివృద్ధి నిరోధక కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మడం లేదన్నారు. మరోసారి బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టడం ఖాయమన్నారు. ఉపసర్పంచ్ తిరుపతి, మాజీ ఎంపీటీసీ రవి, మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతలో దేశానికే ఆదర్శం



తుర్కయంజాల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి



ఆమనగల్లు: సీడీపీఓ సక్కుబాయిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

- ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్
- ఘనంగా మహిళా సంక్షేమ దినోత్సవం

తుర్కయంజాల్: మహిళా సాధికారతలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాగన్నగూడలోని జేఎంఆర్ గార్డెన్స్‌లో మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలుచేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో మరుగుదొడ్డి లేని అంగన్‌వాడీ ఉండకూడదని, వెంటనే ఎస్టిమేషన్‌లను వేసి వాటి నిర్మాణ అనుమతులు పొందాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించడంతో పాటు రూ.15 లక్షలను మంజూరు చేశారు. మహిళలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటాచారి, జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, సీడీపీఓ శాంతిశ్రీ, అడిషనల్ డీఆర్‌డీఓ జంగారెడ్డి, తహసీల్దార్లు అనితా రెడ్డి, సుచరిత, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు స్రవంతి, స్వప్న, ఎంపీపీ కృపేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కల్యాణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో..

ఆమనగల్లు: మహిళా సాధికారతకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చెప్పారు. ఆమనగల్లు పట్టణంలోని ఏఎన్ఎస్ గార్డెన్స్‌లో మంగళవారం ఆమనగల్లు, కల్వకుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టుల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళా సంక్షేమ విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ సక్కుబాయి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మహిళలు బతుకమ్మలతో స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వెల్దండ, తలకొండపల్లి మండలాల మహిళా సంఘాలకు మంజూరైన రూ.20 కోట్ల రుణాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆమనగల్లు మండలానికి చెందిన 26 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన మహిళా ఉద్యోగులను ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీలు కమ్లీ మోత్యానాయక్, మనోహర, విజయ, జెడ్పీటీసీ సభ్యులు అనురాధ, దశరథ్‌నాయక్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓలు సక్కుబాయి, వెంకటమ్మ, సీఐ ఉపేందర్, ఎంపీడీఓలు ఫారూక్‌హుస్సేన్, రామకృష్ణ, తహసీల్దార్ జ్యోతి, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

కడ్తాల్: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతి గృహ సంక్షేమ అధికారి రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆశ్రమ పాఠశాలలో 3 నుంచి 8వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం తరగతులు నిర్వహిస్తున్నట్లు.. అదే విధంగా 3వతరగతి నుంచి 10వ తరగతి వరకు వసతి గృహ సౌకర్యం కలదని తెలిపారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు చదివిన తరగతికి సంబంధించిన సర్టిఫికెట్స్, బోనఫైడ్స్‌తో పాటు ఆదాయం, కుల ధ్రువీకరణ, ఆధార్ పత్రాలతో ఈనెల 30వ తేదీలోపు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

ఇళ్ల స్థలాలు కేటాయించండి

తహసీల్దార్‌కు జర్నలిస్టుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని 6, 7 సర్వే నెంబర్లలో గల ప్రభుత్వ భూమిలో జర్నలిస్టులతో పాటు గ్రామంలోని నిరుపేదలకు ఇండ్ల స్థలాలను కేటాయించాలని రైతుబంధు మండల కోఆర్డినేటర్, మాజీ జెడ్పీటీసీ నర్సింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణకు జెడ్పీటీసీ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నర్సింహ, మల్లేశ్, పాండు, నర్సింహ, కుమార్, శ్రీశైలం, మహేష్, కృష్ణయ్య, విఠల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

తలకొండపల్లి: ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన వడ్డె లక్ష్మమ్మకు రూ.18,000, కోరింత తండాకు చెందిన కిషన్‌కు రూ.29,500 సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం చెక్కులను వెల్జాల్‌లో అందజేశారు. అనంతరం చౌదర్‌పల్లి గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయాభివృద్ధికి రూ.10,000 ఆర్థికసహాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రయ్య, ఉప సర్పంచ్‌లు శ్రీనివాసురెడ్డి, రవి, మాజీ ఎంపీటీసీ భగ్‌వాన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాలకిష్టయ్య, కోఆప్షన్ సభ్యుడు బుచ్చయ్య, దస్తగిరి మోహన్‌లాల్, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండుగలా దశాబ్ది ఉత్సవాలు

యాచారం: దశాబ్ది ఉత్సవాలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొందని ఇబ్రహీంపట్నం డివిజన్ డీఎల్‌పీఓ సంధ్యారాణి పేర్కొన్నారు. మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడ, గునుగల్ గ్రామాల్లో మంగళవారం ఆమె పర్యటించి దశాబ్ది ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి పలు కాలనీల్లో పర్యటించారు. పల్లె ప్రగతి నాటి నుంచి నేటి వరకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫొటో మ్యాప్‌ను పరిశీలించారు. గ్రామాల్లో డ్రైనేజీ కాల్వలు శుభ్రంగా ఉంచాలని, తాగు నీటి సమస్య లేకుండా చూడాలని సూచించారు.

కొనసాగుతున్న ధర్నా

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని బండరావిరాలలోని మైనింగ్‌జోన్‌ను రద్దుచేయడంతో పాటు సర్వే నం 268లో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ భూనిర్వాసితులు, వారి కుటుంబాలు చేపడుతున్న ధర్నా మంగళవారం 302వ రోజుకు చేరింది. తమ ప్రాణాలకు హాని కలిగించే మైనింగ్ జోన్‌ను రద్దు చేయాలని శాంతియుతంగా ఇన్నిరోజులుగా ధర్నా చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మా భూములను మాకే ఇవ్వాలి అనే నినాదంతోనే తామంతా పోరాటం చేస్తున్నామని.. మాకు న్యాయం జరిగే వరకూ క్రషర్లు పనిచేయకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

ధర్మన్నగూడలో బీజేపీ శ్రేణుల పర్యటన

యాచారం: మండల పరిధిలోని ధర్మన్నగూడ గ్రామంలో బీజేపీ శ్రేణులు మంగళవారం కాలనీ బాట పట్టారు. గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత సమయంలోగా పనులు చేయకపోవడంతో గ్రామాలకు ఇచ్చిన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగించకపోవడంతో వెనక్కి వెళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పనుల చేపట్టకుండా గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏం చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. అధికారులు కూడా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పుప్పాల శాంతికుమార్, జంగమ్మ, నర్సింహ, శ్రీశైలం, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.